సాక్షి నంద్యాల

బుధవారం । 16 । జూలై । 2025



అవినీతి.. రయ్..రయ్!

రవాణా శాఖ అధికారులు ఎన్ఫోర్స్‌మెంట్ పేరుతో రోడ్లపై తిష్టవేసి నయా దందాకు తెర లేపారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలకు జరిమానా విధించకుండా మామూళ్లు వసూలు చేస్తున్నారు. 8లో▸

రూ.37.9 లక్షలు పట్టివేత



బెంగళూరుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఓ వ్యాపారి అక్రమంగా తరలిస్తున్న రూ. 37.9 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.80
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.135
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:37,327
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:25,021

న్యూస్‌రీల్

శ్రీశైలండ్యాం గేట్ల మూసివేత



శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో తెరచి ఉంచిన ఒక రేడియల్ క్రస్ట్‌గేటును మంగళవారం ఉదయం మూసివేశారు. జలాశయానికి భారీగా వరద వస్తుందని ఈనెల 8వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మూడు క్రస్ట్ గేట్లను 10 అడుగులకు తెరచి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల ప్రారంభించారు. కృష్ణా బేసిన్‌లో వారం రోజులపాటు వరద ప్రవాహం భారీగా ఉండడడం, తర్వాత రోజురోజుకు తగ్గిపోతుండడంతో తెరచి ఉంచిన మూడు గేట్లలో రెండింటిని గత శనివారం ఉదయం రెండు గేట్లను మూసివేశారు. సోమవారం నుంచి మంగళవారం వారం వరకు ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 70,111 క్యూసెక్కుల వరదనీరు శ్రీశైలంకు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 1,17,102 క్యూసెక్కులను వదిలారు. నాగార్జునసాగర్‌కు స్పిల్‌వే ద్వారా 27,127 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన అనంతరం 69,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 20,000 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కులను వదిలారు. మంగళవారం సాయంత్రానికి జలాశయంలో 200.1971 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 882.20 అడుగులకు చేరుకుంది.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు గడువు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో రెండో విడత ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు iti. ap. gov. in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 22వ తేదీలోపు నంద్యాల ప్రభుత్వ ఐటీఐలోనే సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 23వ తేదీన ఉదయం 10గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు. పదవ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఒక సంవత్సరం కోర్సులు మెకానికల్ డీజిల్, వెల్డర్, రెండేళ్ల కోర్సులు డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, రెఫ్రిజేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్ టెక్, కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరింత సమాచారం కోసం 9866022451ను సంప్రదించాలన్నారు.

చెన్నై కాలువకు నీరు విడుదల

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి మంగళవారం చెన్నై కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ సామర్థ్యం 16.95 టీఎంసీలు కాగా ప్రస్తుతం 11.75 టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 13,500 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. వెలుగోడు రిజర్వాయర్ నుం,ఇ కింది ప్రాంతంలో ఉన్న రిజర్వాయర్లతో పాటు చెన్నై వాసులకు తాగునీటి కోసం నీటిని సరఫరా చేస్తున్నారు.

రుద్రవరం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

రుద్రవరం: మేజర్ పంచాయతీ రుద్రవరం గ్రేడ్–1 కార్యదర్శి సుబ్బారావుపై వేటు పడింది. మేజర్ పంచాయతీకి సంబంధించిన రూ.2.13 కోట్లకు లెక్కలు లేక పోవడంతో పంచాయతీ రాజ్‌శాఖ ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. ఆ నిధులకు సంబంధించి పంచాయతీ తీర్మానాలు, ఎంబుక్కులు, ఇతర రికార్డులు ఏవీ లేకుండా ఫేక్ ఓచర్లు చూపించడంతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

రేపు సీఎం చంద్రబాబు రాక



మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నందికొట్కూరు: హంద్రీనీవా కాల్వకు నీటిని విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 17వ తేదీన మల్యాలకు రానున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. మల్యాల ఎత్తిపోతల వద్ద హంద్రీనీవా ప్రాజెక్టు మోటార్లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వారి వెంట ఎమ్మెల్యే జయసూర్య, జేసీ విష్ణుచరణ్, ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ తదితరులు ఉన్నారు.

నిధులు దోచి.. అక్రమాలు దాచి!



హంద్రీనీవాలో 100 నుంచి 105 కి.మీ మధ్య భారీగా అవినీతి

- లక్ష క్యూబిక్ మీటర్లకు పైగా మట్టి తవ్వకుండా వదిలేసిన ఏజెన్సీ
- చేయని పనులకు దాదాపు రూ.4.3 కోట్ల బిల్లుల చెల్లింపు
- గతంలో కాలువ విస్తరణ పనులు చేయలేమని చేతులెత్తేసిన హెచ్ఈఎస్
- విజిలెన్స్ తనిఖీల్లో బయటపడ్డ బండారం

కర్నూలు సిటీ: రాయలసీమ జిల్లాలకు సాగు, తాగు నీటిని అందించేందుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005లో హంద్రీనీవా సుజల స్రవంతిని చేపట్టారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 33లక్షల మంది తాగునీటి అవసరాలు, రాయలసీమ జిల్లాల్లోని 6.025 లక్షల ఆయకట్టుకు సాగునీటిని అందించాలనేది లక్ష్యం. వైఎస్సార్ హయాంలోనే ప్రధాన కాలువ పనులు, పంపింగ్ స్టేషన్లు పూర్తిచేశారు. ఆయన తరువాత వచ్చిన సీఎంలు పట్టించుకోకపోవడంతో అసంపూర్తి పనులతోనే 2012లో హంద్రీనీవా ట్రయల్ రన్ చేశారు. ఆ సమయంలో పనులు వేగంగా చేసేందుకు ఫేజ్–1 పరిధిలో 28, 28ఎ ప్యాకేజీ పనులు చేస్తున్న మ్యాక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి కొంత పనిని మినహాయించి ప్రసాద్ కంపెనీకి అప్పగించారు. అయినా పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత కాలువ సామర్థ్యం తగ్గిందని 2017–18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కులకు పెంచేందుకు రూ.629.69 కోట్లతో పనులు చేపట్టి సుమారు రూ.300 కోట్ల మేర పనులు చేశారు. ఆ సమయంలో 79.075 కి.మీ దగ్గర నుంచి 134.270 కి.మీ వరకు విస్తరణ పనులు దక్కించుకున్న హెచ్ఈసీ ఏజెన్సీ 100 కి.మీ నుంచి 105 కి.మీ మధ్యలో కాలువ కొలతలను చూసి తాము చేయలేమని అప్పటి ప్రభుత్వానికి లేఖ రాసింది. దాంతో ప్రధాన కాలువ తవ్వకాల్లో అక్రమాలు వెలుగుచూశాయి.

కొలతల్లో తేడాతో వెలుగులోకి అవినీతి

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం నుంచి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు సాగు, తాగునీరు పారుతోంది. ఆ కాలువ కర్నూలు జిల్లాలో సుమారు 144 కి.మీ ప్రయాణిస్తుంది. కాలువ పరిధిలో కృష్ణగిరి (0.61 టీఎంసీలు), పందికోన (1.126 టీఎంసీలు) రిజర్వాయర్లు ఉన్నాయి. కాలువ కింద భాగంలో 9.4 మీటర్ల వెడల్పు, లోతు ఒక్కోచోట ఒకలా సుమారు 30 మీటర్లు ఉంటుంది. అయితే, 100 కి.మీ నుంచి 105 కి.మీ వరకు కాలువ వెడల్పు 9.4 మీటర్లకు.. ఒకచోట ఆరు, మరో చోట 8, 7 మీటర్ల చొప్పున సుమారు 1.5 మీటర్లు తక్కువ తవ్వారు. లోతు సైతం సుమారు 1 మీటరు తక్కువ తవ్వినట్లు సమాచారం. మొత్తంగా లక్ష క్యూబిక్ మీటర్లకు పైగానే మట్టి, రాక్ తొలగించే పనిని చేయకుండా 2014–15లో బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. అనంతరం.. 2017–18లో హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు చేపట్టారు. హెచ్ఈసీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు 79.075 నుంచి 134.270 కిమీ. వరకు రూ.242.10 కోట్లతో కాల్వ విస్తరణ పనులు చేపట్టేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా.. పనులు మొదలుపెట్టేందుకు ముందుగా ప్రధాన కాలువ కొలతలు వేశారు. ఆ సమయంలో వారు చేసుకున్న ఒప్పంద కొలతలకు క్షేత్రస్థాయిలో వచ్చిన కొలతలకు చాలా తేడాలొచ్చాయి. దీనిపై అప్పటి టీడీపీ ప్రభుత్వానికి వారు లేఖ రాశారు. దీంతో అక్కడ అక్రమాలు వెలుగుచూశాయి. పనిచేయకపోయినా చేసినట్లు చూపి బిల్లులు చెల్లించినట్లు బట్టబయలైంది. అంతవరకు ఇంజనీర్లు సైతం ఆ విషయాన్ని దాచిపెట్టారని తెలుస్తోంది.



హంద్రీనీవా 100 నుంచి 105 కి.మీ మధ్యలో జరుగుతున్న పనులు



హంద్రీనీవా కాల్వ (ఫైల్)

ఏజెన్సీపై కూటమి నేతల ఒత్తిడి.. ఈఈని పక్కకు పెట్టిన సీఈ

- ➤ విజిలెన్స్ తనిఖీ నివేదిక ఆధారంగా ఏ మేరకు ఆ ప్రాంతంలో పనులు చేయలేదో గుర్తించేందుకు హంద్రీనీవా డివిజన్–3 ఈఈ పర్యవేక్షణలో ఏజెన్సీ, ఇంజినీర్లు చేస్తున్న కొలతలపై తనకు ఏ రోజుకా రోజు నివేదిక ఇవ్వాలని ఏజెన్సీకి ఈఈ సూచించారు.
- ➤ దీనిపై ప్యాకేజీ–2 ఏజెన్సీ వీపీఆర్–డీఎస్ఆర్ (నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సంబంధించినది) జల వనరుల శాఖ ఉన్నతాధికారుల ద్వారా ఒత్తిడి చేయడంతో డివిజన్–3 పరిధిలోని పనుల బాధ్యతల నుంచి ఈఈని తొలగించి, డివిజన్–4 ఈఈకి అప్పగించారు.
- ➤ ఈ విషయంలో హంద్రీనీవా–1 ఎస్ఈ అభ్యంతరం చెప్పినా కూడా సీఈ వినిపించుకోలేదని సమాచారం.
- ➤ జల వనరుల శాఖలో గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని, ఇదే మొదటిసారిగా ఆ శాఖ ఇంజనీర్లలో చర్చ జరుగుతోంది.

ఉత్తుత్తి రికవరీ

2004–05 ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం ప్రధాన కాలువ తవ్విన కాంట్రాక్టరు (మ్యాక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కు క్యూబిక్ రాక్‌కు రూ.135, కంట్రోల్ బ్లాసింగ్‌కు రూ.200 ప్రకారం బిల్లులు చెల్లించారు. ఈ ప్రకారం రూ.4.3 కోట్లకు పైగా అదనంగా బిల్లులు చెల్లించారు. 2023లో జరిగిన విజిలెన్స్ తనిఖీల్లో ఈ తేడాలున్నట్లు గుర్తించి మ్యాక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రసాద్ కంపెనీ నుంచి రూ.87 లక్షలు రికవరి చేయాలని సూచించారు. కానీ, ఇప్పటివరకు పైసా కూడా రికవరీ చేయలేదని తెలుస్తోంది. అయితే, హంద్రీనీవా ఇంజనీర్లు మాత్రం అదనంగా చెల్లించిన బిల్లులు, ర్యాంపులకు సంబంధించి రూ.6 కోట్లు రికవరీ చేశామని చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఫైనల్ బిల్లులో మినహాయిస్తాం

హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు ఫేజ్–1లో రెండు ప్యాకేజీలుగా చేపట్టాం. పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. 2023లో విజిలెన్స్ తనిఖీలు చేసినట్లున్నారు. 100 కి.మీ నుంచి 105 కి.మీ మధ్యలో ప్రధాన కాలువ పనులు చేసిన కాంట్రాక్టరుకు ఫైనల్ బిల్లులు చేయాల్సి ఉంది. చేయని పనికి ఎంతమేరకు బిల్లులు అవుతాయో లెక్కించి ఫైనల్ బిల్లులో మినహాయిస్తాం. అలాగే, ప్యాకేజీ–2 పరిధిలో కొలతలు వేశాకే పనులు మొదలుపెట్టాలంటే ఆలస్యమవుతుందని డివిజన్–3 ఈఈ నుంచి విస్తరణ పనులను డివిజన్–4 ఈఈకి అప్పగించాం. ఇందులో ఎవరి ఒత్తిళ్లు లేవు.

– నాగరాజు, హంద్రీనీవా సీఈ

నాణ్యత డొల్ల.. రోడ్డు గుల్ల

- రూ.5.40 కోట్లతో నిర్మించిన రెండు నెలలకే ఛిద్రం



వద్దుగండ్ల చెరువు సమీపంలో ప్యాచ్ వేసిన దృశ్యం

పది కాలాల పాటు పదిలంగా ఉండాల్సిన రోడ్డు మున్నాళ్ల ముచ్చటగా మారింది. ఊరికి కొత్త రోడ్డు వేశారనే ప్రజల సంతోషం రెండు నెలలకే మాయమైంది. కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్డులో నాణ్యత డొల్ల కావడంతో రోడ్డంతా గుల్లగా మారుతోంది. పాణ్యం – దుర్వేశి మెట్ట వరకు దాదాపుగా 13 కిలో మీటర్ల డీఎంఎఫ్ కింద రూ. 5.40 కోట్లతో బీటీ రోడ్డు వేశారు. మే నెలలో వేసిన ఈ బీటీ రోడ్డు పట్టుమని రెండు నెలల పూర్తి కాకముందే నాణ్యత బట్టబయలైంది. గోరుకల్లు – పాణ్యం వరకు గుంతలు పడడంతో అధికారులు ప్యాచ్‌లు వేసి అక్రమాలను కప్పేశారు. మరో చోటా రోడ్డు సైడ్ దెబ్బతిని వాహనాలు అదుపు తప్పేలా మారింది. రోడ్డు సైడ్‌కు గ్రావెల్ వేయాల్సి ఉండగా గోరుకల్లు వద్ద లభించే సుద్దను తెచ్చి వేయడంతో ప్రజలు అడ్డుకున్నారు. ఆ తర్వాత గ్రావెల్ వేసి రోలర్‌తో తొక్కించారు. ఇప్పటికీ పాణ్యం సమీపంలో సైడ్‌కు సుద్ద ఉంది. రోడ్డు నాణ్యత పరిక్షించాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడంతో రహదారి ఛిద్రమవుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.

– పాణ్యం



సబ్‌స్టేషన్ వద్ద దెబ్బతిన్న బీటీ రోడ్డు



కొండజుటూరు గ్రామం వద్ద ..



గోరుకల్లు గ్రామ సమీపంలో ..

అమ్మా.. నన్ను క్షమించూ!

- ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన కుమారుడు
- అనారోగ్యంతో మృతి చెందిన తల్లి
- చివరి చూపునకు రాలేక తల్లడిల్లిన కొడుకు

దొర్నిపాడు: 'అమ్మా నిన్ను చూసేందుకు రాలేకపోతున్నా.. నీ కడ చూపునకు నోచుకోలేనంతా దూరంలో ఉన్నాను. నీ పాడి మోయలేక పోతున్నా.. నన్ను క్షమించు' అంటూ ఓ తనయుడి ఆవేదన పలువురిని కంటతడి పెట్టించింది. ఉపాధి కోసం దుబాయ్‌లో ఉన్న కుమారుడు తల్లి అంత్యక్రియలకు రాలేక ఎంతో కుమిలిపోయాడు. వీడియో కాల్‌లో తన తల్లి చివరి చూపును వీక్షించి కన్నీటిపర్యంతమయ్యాడు. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన పగిడి జయమ్మ(48) గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడేది. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించి ఆమె మంగళవారం మృతి చెందింది. గత ఏడేళ్ల క్రితం భర్త కూడా మృతి చెందాడు. ఇద్దరు కూతుళ్లు సారిక, ఓశమ్మ, ఒక్కగానొక్క కొడుకు ఓబులేసు ఉన్నారు. కొడుకు దుబాయ్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిమరణ వార్త తెలుసుకున్న తనయుడు ఆందోళనకు గురయ్యాడు. దీంతో బంధువులు వీడియో కాల్ చేసి అతని తల్లి అంత్యక్రియలను చూయించారు. తాను బతికుండి కన్న తల్లి పాడి మోయలేక పోతున్నానని.. కన్నీటి పర్యంతం అయ్యాడు. ఈ ఘటన గ్రామంలో పలువురిని కంటతడి పెట్టించింది.



వీడియో కాల్‌లో తల్లిని చూస్తున్న ఓబులేసు

ఆశలు 'వరి'ంచేనా!

- జిల్లాలో 65,276 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం
- కర్నూలు, నంద్యాల సోనారకం సాగుపై ఆసక్తి
- గతేడాది ఖరీఫ్‌లో దిగుబడులు అంతంత మాత్రమే
- మద్దతు ధర లేక రైతులు అప్పులపాలు





గుళ్లదూర్తి వద్ద వరి నాడుమడిని సిద్ధం చేస్తున్న రైతు, సంజామలలో వరి నారుమడి

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వ భరోసా లేక, ప్రకృతి కరుణించక గతేడాది నష్టాలు మూటగట్టుకున్న వరి రైతు ఈ ఏడాది ఖరీఫ్‌లో మళ్లీ అదే పంట సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నాడు. బోరుబావుల కింద నారుమళ్లు పోసిన రైతులు నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలోని బోర్లు, బావులు, కుందూనది, పాలేరు, కుందర వాగు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, తదితర నీటి ఆధారంగా 65,276 హెక్టార్లలో కర్నూలు, నంద్యాల, షుగర్‌లెస్, 555 రకాలకు చెందిన వరిని సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో బండి ఆత్మకూరు మండలంలో అత్యధికంగా 10,507 హెక్టార్లలో, రుద్రవరం మండలంలో 6,064, శిరివెళ్ల 5,694, నంద్యాల 4,671, గోస్పాడు 4,227, బనగానపల్లె 3,637, పాణ్యం 3,559, మహానంది 3,478, వెలుగోడు మండలంలో 3,056 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం. సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లో వరిసాగు విస్తీర్ణం మరింత పెరిగే ఆస్కారముంది. ఇప్పటికే కుందూ నది, వాగులు, బోర్ల కింద నారు మడులు సిద్ధంగా కాగా ఈ నెలాఖరు నుంచి వరినాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

గతేడాది కలిసిరాని వరిసాగు..

జిల్లాలోని గతేడాది 1.65 లక్షల ఎకరాల్లో కర్నూలు సోనా, నంద్యాల సోనా, 555 రకానికి చెందిన వరి సాగు చేశారు. ఎకరాకు రూ. 35 వేల నుంచి రూ. 40 వేలు వెచ్చించారు. కౌలు రైతులు ఎకరాకు ఖరీఫ్‌లో 10 బస్తాలు, రబీలో మూడు బస్తాల వడ్లు చెల్లించేలా వరి మడులను కౌలుకు తీసుకున్నారు. పైరు వివిధ దశల్లో అధిక వర్షాలు కురియడంతో వరిని దోమపోటు, అగ్గి తెగులు ఆశించడంతో తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకునేందుకు పడరానిపాట్లు పడ్డారు. అక్టోబర్ నెలలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరాకు 30 బస్తాలకు మించి దిగుబడులు రాలేదు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర అంతంత మాత్రంగానే పలికింది. బస్తా రూ. 1,490తోనే విక్రయించి భారీగా నష్టపోయారు.

కర్నూలు, నంద్యాల సోనాపై ఆసక్తి..

జిల్లాలో ఈ ఏడాది రైతులు కర్నూలు, నంద్యాల సోనాపై ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ఈ ఏడాది వరికి గిట్టుబాటు ధర ఉండటంతో రైతులు వరిసాగుపై దృష్టి సారించారు. శ్రీశైలం జలాశయానికి వరదనీరు పోటెత్తడంతో ఎస్సార్బీసీ, కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయడనుండటంతో వరిసాగుకు సాగునీరు పుష్కలంగా అందనుంది. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో సాగునీటి వనరుల ఆధారంగా ఇప్పటికే వరినారుమడులు పోసి వరినాట్లకు మడులను సిద్ధం చేసుకుంటున్నారు.

25 ఎకరాలు సిద్ధం చేశా



ఈ ఏడాది నాకున్న ఐదు ఎకరాల సొంత పొలంతోపాటు ఎకరాకు 13 బస్తాలు వడ్లు చెల్లించేలా మరో 20 ఎకరాలను కౌలుకు తీసుకుని కర్నూలు సోనా రకానికి చెందిన వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాను. గతేడాది వరి సాగలో నష్టాలు వచ్చాయి. ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు అన్ని విధాలా కలిసోస్తుందని భావిస్తున్నాను.

– వెంకటేశ్వర్లు, రైతు, కోవెలకుంట్ల

అధికారులు సూచనలు ఇవ్వాలి



గత ఏడాది వరిసాగుతో అన్ని విధాలా నష్టాలు చవిచూశాం. ఈ ఏడాది నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని సన్నద్ధమవుతున్నాను. నారుమడితోపాటు రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు సిద్ధం చేసుకున్నాను. వ్యవసాయ అధికారులు వరిసాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు సలహాలు అందజేయాలి.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, భీమునిపాడు, కోవెలకుంట్ల మండలం

పడిగాపులు కాస్తూ.. కన్నీళ్లతో తిరిగెళ్తూ!



పడిగాపులు కాస్తున్న రైతులు

యూరియాను కూటమి నేతలు ఎగరేసుకుపోతుండటంతో రైతులకు ఇక్కట్లు తప్పని పరిస్థితి. మంగళవారం పెద్ద హరివాణం, సంతెకూడ్లూరు, బసాపురం గ్రామాలకు చెందిన దాదాపు 60 మందికి పైగా రైతులు యూరియా కోసం ఆదోని మండల వ్యవసాయ కార్యాలయం, కేడీసీఎంఎస్ పాయింట్ వద్ద పడిగాపులు కాశారు. మధ్యాహ్నం 1 గంట వరకు కార్యాలయాల వద్ద ఎవరూ అందుబాటులో లేకపోవడం చూస్తే ఈ ప్రభుత్వంలో రైతుల దుస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది.

– ఆదోని రూరల్

క్లుప్తంగా

అట్టెకల్లు కొండల్లో చిరుత

ఆస్పరి: అట్టెకల్లు కొండల్లో చిరుత సంచారంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున శ్రీను అనే రైతు ఇంటి దగ్గర కట్టేసిన గొర్రె పిల్లపై చిరుత దాడి చేసి గాయపరిచింది. గాయపడిన గొర్రె పిల్ల కొద్ది సేపటికి మృతి చెందింది. చిరుత సంచారంతో వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, రైతులు భయాందోళనలు చెందుతున్నారు. ఫారెస్టు అధికారులు చిరుతను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థి ఆత్మహత్య



మృతిచెందిన యశ్వంత్‌శర్మ

ఆళ్లగడ్డ: కళాశాలకు వెళ్లి చదవడం ఇష్టం లేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నల్లగట్ల గ్రామానికి చెందిన వీరయ్య కుమారుడు యశ్వంత్ (17) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తనకు చదవడం ఇష్టం లేదని కులవృత్తి పౌరోహిత్యం నేర్చుకుంటానని కుటుంబ సభ్యులకు చెప్పడంతో.. చదివితే భవిష్యత్ బాగుంటుందని తల్లిదండ్రులు నచ్చజెప్పినా కళాశాలకు వెళ్లలేదు. కనీసం ఇంటర్ అయినా పూర్తి చేయాలని సోమవారం రాత్రి మందలించారు. ఈ క్రమంలో యశ్వంత్ మనస్తాపంతో పురుగు మందు తాగి మృతి చెందాడు. మృతుని తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐపి. నెం : 47/2025

డి.జమాల్ బాబు తండ్రి డి.పెద్దఖాసిమ్ సాహెబ్, ఇంటి.నెం:46/1-1-సి, ఎ.క్యాంపు, చానక్యపురి కాలనీ, బుధవారపేట, కర్నూలు సిటీ, సెల్: 7675828216 ..అర్జీదారుడు

- వర్సెస్ -

దుబ్బా వెంకటేశ్వర రెడ్డి మరియు 78 మంది ఇతరులు ..రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు మరియు నంద్యాల జిల్లా ప్రజలకు తెలియజేయడమేమనగా పై నెంబరు ఐ.పిలో అర్జీదారు అయిన డి.జమాల్ బాబు తండ్రి డి.పెద్దఖాసిమ్ సాహెబ్, ఇంటి.నెం: 46/1-1-సి, ఎ.క్యాంపు, చానక్యపురి కాలనీ, బుధవారపేట, కర్నూలు. అనునతుడు తనను దివాళా దారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో దివాళా అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో ఎవరికైన ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 22.08.2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపగలరు. లేని యెడల సదరు అర్జీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 22.08.2025

కాటం శ్రీనివాస రెడ్డి,
అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
NGO కాలనీ బ్రాంచ్-12909, నంద్యాల జిల్లా

స్వాధీనతా ప్రకటన
రూల్ 8 (1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, NGO కాలనీ బ్రాంచ్ - 12909, నంద్యాల జిల్లా** యొక్క అధీకృత అధికారి యగు దిగువ సంతకందారు **05-05-2025** తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేసి, **రుణగ్రహీత: 1) శ్రీమతి షేక్ జహీరా అలియాస్ గుంటి శశికళ భర్త శ్రీ షేక్ రసూల్ ఆజాద్, 2) శ్రీ షేక్ రసూల్ ఆజాద్ తండ్రి ఎస్.ఖాజావలి,** ఇం.నం.28/1552 (పాత డి.నం.28/1524), లేబర్ క్వార్టర్స్, నంద్యాల టౌన్ & జిల్లా మరియు ఇం.నం.28/1554, నర్స్ క్వార్టర్స్, నంద్యాల టౌన్ & జిల్లా, **అకౌంట్ నం.లు: 32723283944 HL, 35612220263 HL-TOP-UP, 32723285067 Suraksha** వారిని నోటీసులో తెలిపిన మొత్తం **05-05-2025** నాటికి **రూ.13,58,991.00 + 3,29,874.00 + 79,337.00 = రూ.17,68,202.00 (పదిహేడు లక్షల అరవై ఎనిమిది వేల రెండు వందల రెండు రూపాయలు మాత్రమే)** మరియు దానిపై **06-05-2025** నుండి తదుపరి వడ్డీ మరియు ఖర్చులు సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించవలసిందిగా కోరారు.

రుణగ్రహీత/ గ్యారంటారు సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **10 జూలై 2025**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు / గ్యారంటారుకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో వ్యవహరించరాదని, సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారమునైనా మొత్తం **రూ.13,58,991.00 + 3,29,874.00 + 79,337.00 = రూ.17,68,202.00** ప్లస్ దానిపై వడ్డీ ప్లస్ ఖర్చులు కొరకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, NGO కాలనీ బ్రాంచ్-12909, నంద్యాల జిల్లా** చార్జ్‌కు లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను/ గ్యారంటారును మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభ్యమగు సమయానికి సంబంధించి, SARFAESI చట్టంలోని సెక్షన్ 13లో సబ్ సెక్షన్(8) నిబంధనలను గమనించాల్సిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

గమనిక: ఈ బ్రాంచ్ ద్వారా జారీచేయబడిన 08-07-2025 తేదీగల స్వాధీనత ప్రకటన ఉపసంహరించుకోబడినదని గమనించగలరు. ఆ ప్రకటనకు బదులు ఈ ప్రకటన మీకు జారీచేయబడుచున్నది.

స్థిరాస్తి వివరణ

రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.9713/2011, తేది:12.12.2011 ప్రకారం, షేక్ జహీరా అలియాస్ గుంటి శశికళ భర్త షేక్ రసూల్ ఆజాద్‌కు చెందిన నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా, నంద్యాల సబ్-రిజిస్ట్రేషన్‌లోని నంద్యాల మున్సిపల్ పరిధులలో గల లేబర్ క్వార్టర్స్ ఏరియా వద్దగల సర్వే నం.361/2పైకిలో ఉన్న డి.నం.28-1552 (పాత డి.నం.28-1524) గల నివాసిత ఇల్లు. విస్తీర్ణం:93.05 చ.గజాలు. **కొలతలు:** తూర్పు-పశ్చిమం: 25 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 33 1/2 అడుగులు, **సరిహద్దులు: తూర్పు:** ప్లాట్ నం. SRT24, **పశ్చిమం:** పబ్లిక్ రోడ్, **ఉత్తరం:** రోడ్, **దక్షిణం:** చిత్రాల రాజశేఖర్ ప్లాట్.

ప్రదేశం:నంద్యాల | సం/- అధీకృత అధికారి,
తేది: 10.07.2025 | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అవినీతి రయ్.. రయ్..!

- అక్రమ రవాణా, ఓవర్ లోడ్ వాహనాలపై నిఘా పెట్టి వసూళ్లు
- ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి జేబులు నింపుకుంటున్న అధికారులు
- అడిగినంత ఇవ్వకపోతే కేసులు పెడతామని బెదిరింపు
- నమ్మకస్తులైన లారీ ఓనర్లతో వసూళ్లకు ప్రత్యేక వ్యవస్థ

☛ తెలంగాణ వైపు నుంచి 62.5 టన్నుల గ్రానైట్ లోడుతో వస్తున్న ఓ లారీని రవాణా శాఖ అధికారులు కర్నూలు శివారులో ఆపారు. 35 టన్నులతో వెళ్లాల్సిన లారీలో 27.50 టన్నులు అదనంగా ఉన్నందున రూ.73 వేలు జరిమానా విధించాలి. అయితే రూ.15 వేలు తీసుకుని లారీని వదిలేశారు.

☛ కర్ణాటక నుంచి కర్నూలు మీదుగా మరో ప్రాంతానికి బొగ్గుల లారీ ఓవర్ లోడ్‌తో వెళ్తోంది. టోల్‌గేట్ వద్ద రవాణా శాఖ అధికారులు తనిఖీ చేసి కేసు రాస్తే రూ.50 వేలు అవుతుంది. అందులో సగం ఇస్తే వదిలేస్తామంటూ బేరం కుదుర్చుకుని వదిలేశారు.

☛ హైదరాబాదు – బెంగళూరు 44వ నంబర్ జాతీయ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు అధిక సామర్థ్యంతో వెళ్తుంటాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో రోడ్లపై తిష్ట వేసి అక్రమ, ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు జరిమానా విధించి తర్వాత బేరం కుదుర్చుకోవడం లేదా కేసుల పేరుతో భయపెట్టి వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కర్నూలు: వాహన సామర్థ్య పరీక్షల (ఎఫ్‌సీ) సర్టిఫికెట్ల జారీ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం, డ్రైవింగ్ లైసెన్స్ జారీ కోసం ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ సేవలు అందుబాటులోకి రావడంతో ఆయా సేవల నుంచి వచ్చే మామూళ్లు నిలిచిపోయాయి. దీంతో రవాణా శాఖ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో నిత్యం రోడ్లపై తిష్ట వేసి నయా దందాకు తెర లేపారు. 44వ నంబర్ జాతీయ రహదారిపై ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు కర్నూలు మీదుగా వాహనాలు వెళ్తుంటాయి. అధికారిక లెక్కల ప్రకారం ఈ మార్గంలో గంటకు వెయ్యికి పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సరుకు రవాణా చేసే వాహనాలకు సంబంధించి వే బిల్లులు, అంతర్రాష్ట్ర పర్మిట్లు, ఇతర అనుమతుల పేరుతో అధికారులు ప్రతిరోజూ తనిఖీలు చేస్తుంటారు. అక్రమ రవాణా, ఓవర్ లోడ్‌తో వెళ్తుంటే సదరు వాహనాలకు జరిమానా విధించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. జరిమానాలు కూడా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరగాలి. భౌతికంగా ఒక్క రూపాయి వసూలు చేసేందుకు వీలు లేదు. అయితే వాహనంలో ఉన్న సరుకు, సామర్థ్యాన్ని బట్టి ఒక్కో లారీ నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వసూలు చేస్తున్నారు. ఇలా రోజుకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా అక్రమ రవాణా, ఓవర్ లోడ్ వాహనాల ద్వారా వసూలవుతున్నట్లు ఆ శాఖలో పనిచేసే కొంతమంది అధికారులు చర్చించుకుంటున్నారు.



రవాణా శాఖ జిల్లా కార్యాలయం (ఫైల్)

5వ తేదీలోపే మామూళ్లు

ఎర్రమట్టి, ఇసుక, కంకర, గ్రానైట్ తరలించే లారీలు, టిప్పర్ల యజమానుల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం చెన్నై - సూరత్ హైవే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులకు ఇసుక, ఎర్రమట్టిని టిప్పర్లలో సామర్థ్యానికి మించి తరలిస్తుండటంతో వారి నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. క్రిష్ణగిరి, తాడిపత్రి, బేతంచెర్ల, డోన్ ప్రాంతాల నుంచి కర్నూలు మీదుగా ఇతర ప్రాంతాలకు గ్రానైట్, చిప్స్, బండలు, సిమెంటు, మైనింగ్ మెటీరియల్, పౌడర్ వంటివి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. వాటిపై కూడా నిఘా వేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. జిల్లాలో 400కు పైగా వాహనాల నుంచి నెలకు ఒక్కో వాహనానికి రూ.8 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రతి నెలా 5వ తేదీలోపు ఆయా ప్రాంతాల్లోని నమ్మకస్తులైన లారీ యజమానులు మామూళ్లు వసూలు చేసి అధికారులకు ముట్టజెప్పే విధంగా ఒప్పందం చేసుకున్నట్లు చర్చ జరుగుతోంది. కర్నూలులోని ఓ ట్రాన్స్‌పోర్టు నిర్వాహకుడిని మధ్యవర్తిగా ఏర్పాటు చేసుకుని మామూళ్లు దండుకుంటున్నట్లు సమాచారం. గొర్రెలు, బర్రెలు తరలించే లారీలు కూడా మామూళ్లు ఇవ్వాల్సిందే. ఔటర్ రింగ్‌రోడ్డు, వెంగన్న బావి, నన్నూరు టోల్ ప్లాజా ప్రాంతాల్లో తిష్ట వేసి మామూళ్లు వసూలు చేస్తున్నారు. అలాగే కోడుమూరు రోడ్డులో తిష్ట వేసి ఈర్లదిన్నె ప్రాంతం నుంచి వచ్చే ఇసుక లారీల నుంచి, నాగలూటి నుంచి కర్నూలుకు నాపరాయి రవాణా చేసే ట్రాక్టర్ల నుంచి మామూళ్లు దండుకుంటున్నారు. ఇలా నెలకు రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా వసూలు చేసి, కిందిస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు వాటాలు వేసి పంచుకుంటున్నట్లు ఆ శాఖలోని కొంతమంది బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

చేతికి అంటకుండా..

తమ చేతికి మట్టి అంటకుండా నమ్మకస్తులైన ఆర్‌టీఏ ఏజెంట్లు, ప్రైవేటు వ్యక్తుల ఫోన్ నంబర్లు ఇచ్చి ఫోన్‌పే ద్వారా మామూళ్లు ముట్టిన తర్వాతనే వాహనదారులు ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. వాహన రికార్డులు సక్రమంగా లేవనో, లోడ్ ఎక్కువగా ఉందనో, పర్మిట్ లేదనో? ఇలా ఏదో ఒక సాకు చూపి అడిగినంత ఇచ్చిన తర్వాత కానీ వాహనం ముందుకు కదలనివ్వరు. అక్రమ వసూళ్ల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి రోజుకు కనీసం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు గండి పడుతున్నట్లు సమాచారం. రవాణా శాఖ అధికారుల అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వ టోల్‌ఫ్రీ నంబర్‌కు జిల్లా నుంచి తరచూ ఫిర్యాదులు వెళ్తున్నట్లు సమాచారం.

రవాణా శాఖకు అన్నిటికంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ కీలకం. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరిగే వాహనాలను తనిఖీ చేసే అధికారం వీరికి ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని జిల్లా మీదుగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాల నుంచి భారీగా మామూళ్లు వసూలు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: మండలంలోని పెద్దతుంబళం గ్రామం నుంచి దాదాపు 50 కుటుంబాల వారు మంగళవారం స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరారు. నాయకులు హుసేన్‌పీరా, షేక్‌అహ్మద్ రఫిక్ ఆధ్వర్యంలో జాకీర్, జహీర్, అబ్దుల్‌అజార్, షేక్షావలి, ఫిరోజ్, ఖాజా, జాఫర్, అన్వర్, బుడ్డా కాశీం, మహమ్మద్‌బాషా, ఖాదర్, ఫిరోజ్‌తో పాటు మరికొంతమంది పార్టీలో చేరగా వారికి ఆదోని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏ పార్టీతో సంబంధం లేని యువత ప్రజల పక్షాన నిలిచే వైఎస్సార్‌సీపీలో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. కూటమి పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, అన్యాయాలను చూసి ప్రతి ఒక్కరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. తప్పుడు హామీలను ఇచ్చి ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటుకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బి.దేవా, మండల యూత్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కేశవరాయుడు, రహమాన్, ఫయాజ్, చిన్న ఈరన్న, బీమా, సాంబ, వీరంజి తదితరులు పాల్గొన్నారు.

చేప కోసం ఘర్షణ

- పడవ తెడ్లతో కొట్టుకున్న మత్స్యకారులు



నదిలో ఘర్షణ పడుతున్న మత్స్యకారులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల డ్యామ్ దిగువన మంగళవారం కృష్ణానదిలో రెండు వర్గాల మత్స్యకారులు ఒక చేప కోసం ఘర్షణ పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లింగాలగట్టు వైజాగ్ క్యాంపులోని మత్స్యకారులు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. రెండు వర్గాలు టీడీపీకి చెందినవి. ఈ రెండు వర్గాలు చేప కోసం పడవ తెడ్లతో కొట్టుకున్నారు. డ్యామ్‌కు వరద ప్రవాహం తగ్గడంతో మంగళవారం గేట్లు మూసివేశారు. దీంతో మత్స్యకారులు డ్యాం ముందుభాగంలో వలలు వేశారు. ఇరువర్గాలకు చెందిన వలల మధ్యలో ఓ చేప చిక్కింది. ఆ చేప తమదంటే తమదని ఒక వర్గంలోని పోలయ్య, బుజ్జి, నూకరాజు, గౌందీశ్వరరావు, మరో వర్గంలోని నామరాజు, పి.శ్రీను, సీహెచ్ రమణలు ఘర్షణ పడ్డారు. నదిలోనే పడవలపై తెడ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో 8 తెడ్లు విరిగిపోయాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గాయపడిన వారికి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కాగా ఇరు వర్గాలు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయమై టూటౌన్ సీఐ చంద్రబాబును వివరణ కోరగా ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇష్టం లేని పెళ్లి నిశ్చయించారని బలవన్మరణం

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో మానస (20) అనే యువతి ఇష్టం లేకుండా వివాహం నిశ్చయించారని మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ సురేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వరలక్ష్మి కూతురు మానస ఇంటర్మీడియెట్ వరకు చదువుకుంది. తండ్రి మల్లయ్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం ఉన్నారు. పెద్ద కూతురు మానసకు ఇటీవల వివాహం నిశ్చయించారు. నెల రోజుల్లో వివాహం చేసేందుకు తేదీ కూడా ఖరారు చేసుకున్నారు. పెళ్లి ఇష్టం లేని మానస మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సబ్ రిజిస్ట్రార్‌కు ఐదు ఇంక్రిమెంట్‌ల నిలుపుదల

- లోకాయుక్తకు నివేదించిన అనంతపురం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ

కర్నూలు(సెంట్రల్): ప్రస్తుతం గుత్తి సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న ఎస్.మహబూబ్‌అలీకి ఐదు ఇంక్రిమెంట్‌లు నిలుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు అనంతపురం డీఐజీ లోకాయుక్తకు నివేదించారు. ఆయన కర్నూలు జిల్లా కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసే సమయంలో 136 పత్రాలకు సంబంధించి మార్కెట్ విలువను తక్కువగా చూపడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.53,01,796 నష్టం జరిగినట్లు కర్నూలులోని బంగారుపేటకు చెందిన బీపీ జాన్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. దీనిపై లోకాయుక్త 858/2013/బీ2గా ఫిర్యాదును నమోదు చేసి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీని విచారణాధికారిగా నియమించింది. విచారణలో అక్రమాలు నిజమేనని తెలడంతో సదరు సబ్ రిజిస్ట్రార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖను లోకాయుక్త ఆదేశించింది. ఆ మేరకు సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకున్నట్లు మంగళవారం లోకాయుక్తకు అనంతపురం డీఐజీ నివేదించడంతో కేసును మూసి వేస్తున్నట్లు ఉప లోకాయుక్త పి.రజని తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్ హాజీమియ్యాపై చర్యలు

నిషేధిత జాబితా 22లోని భూమిని రిజిస్ట్రేషన్ చేసిన మరో ఘటనలో సీనియర్ అసిస్టెంట్ హాజీమయ్యాకు రెండు ఇంక్రిమెంట్లను నిలిపివేస్తూ ఉప లోకాయుక్త ఉత్తర్వులుజారీ చేసింది. కర్నూలు జిల్లా కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 16/2ఏ1లోని ప్రభుత్వ భూమి నిషేధిత జాబితాలో ఉంది. ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని వి.మురళీధరరెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదుపై సంస్థ కర్నూలు డీఐజీతో విచారణ చేయించగా అక్రమమని తేలింది. ఆ మేరకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న అప్పటి సీనియర్ అసిస్టెంట్ హాజీమియ్యాపై చర్యలు తీసుకున్నట్లు మంగళవారం డీఐజీ లోకాయుక్తకు నివేదించడంతో కేసును మూసి వేస్తున్నట్లు ఉపలోకాయుక్త తెలిపారు.

స్క్వాడ్ వస్తోంది.. జాగ్రత్త !



గూడూరులో తనిఖీ చేస్తున్న స్క్వాడ్ బృందం

కర్నూలు(అగ్రికల్చర్): ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలపై ఆకస్మిక తనిఖీలకు వచ్చిన టీమ్‌లు వివిధ మండలాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయితే సంబంధిత వ్యవసాయ సిబ్బంది ముందుగానే 'స్క్వాడ్ వస్తోంది.. జాగ్రత్తగా ఉండాలని ఉప్పందిస్తుండటంతో డీలర్లు, అక్రమార్కులు అప్రమత్తం అవుతున్నారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేపట్టేందుకు రెండు బృందాలు వచ్చాయి. ఇందులో వివిధ జిల్లాలకు చెందిన ఏడీఏలు, విజిలెన్స్ అధికారులు ఉన్నారు. ఆకస్మికంగా తనిఖీలకు వెళితే అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. జిల్లాలో కొన్ని మండలాల్లో ప్రైవేటు డీలర్లు యూరియాను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. కొతాళంలోని ఓ ఆర్‌బీకేలో 600 బస్తాల యూరియా ఉంది. ఆర్‌బీకేకు వచ్చిన యూరియాపై ఓ ప్రైవేటు డీలరు పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. మా షాపులో మందులు, విత్తనాలు తీసుకోవడం లేదు. అలాంటప్పుడు మీకు యూరియా ఎందుకివ్వాలంటూ రైతులపై రుసరుసలాడుతుండటంతో ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రత్యేక స్క్వాడ్‌లు ఇలాంటి వాటిపై దృష్టి సారించాల్సి ఉంది. అప్పుడు అక్రమ నిల్వలు బయటికి వస్తాయి. రైతులకు మేలు జరుగుతుంది. ముందస్తు సమాచారం ఇచ్చి తనిఖీలకు తీసుకెళుతుండటం వల్ల తనిఖీలు నామమాత్రం అయినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక బృందం ఆదోని, కౌతాళం మండలాల్లో తనిఖీలు జరిపి రూ.48.5 లక్షల విలువచేసే రసాయన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసింది. స్క్వాడ్ బృందం కౌతాళంలో తనిఖీలు నిర్వహించినా, ఆర్‌బీకేల్లోని ఎరువులపై ప్రైవేటు పెత్తనం చెలాయించడాన్ని గుర్తించలేదు. మరో బృందం గూడూరు, ఎమ్మిగనూరు, గోనెగండ్లలో తనిఖీలు నిర్వహించింది. ఈ బృందం రూ.38.29 లక్షల విలువ చేసే ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను నిలిపివేసింది.

తాతను చంపిన మనుమడు

- మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని దారుణం



మృతి చెందిన షేక్ కోట్ల ఉశేన్ సా

బనగానపల్లె: పట్టణంలోని బీసీ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం దారుణం చోటుచేసుకుంది. సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన షేక్ కోట్ల ఉశేన్ సా (75) పక్షవాతంతో కాలు, చెయ్యి పడిపోవడంతో గత కొంతకాలంగా మంచానికే పరిమితమై ఉన్నాడు. ఈ స్థితిలో మంగళవారం అతని మనుమడు షేక్ ఉశేన్ బాషా మద్యం మత్తులో తాతను డబ్బులు ఇవ్వమని అడిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో బ్లేడ్‌తో తల, గొంతు ఇతర శరీర భాగాలపై కోశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో వృద్ధుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి కుమార్తె షేకున్ బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఘటన స్థలాన్ని సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి పరిశీలించారు.

సైబర్ వలలో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి

- మనీ లాండరింగ్ కేసులో ఇరుక్కున్నావంటూ బెదిరించి రూ.15 వేలు కాజేత



బాధితుడు బాబురాజేంద్రప్రసాద్



మనీలాండరింగ్ కేసు నమోదైనట్లు వాట్సాప్‌లో వచ్చిన నకిలీ నోటీసు

ఆదోని అర్బన్: మనీ లాండరింగ్ కేసులో ఇరుక్కున్నావంటూ బెదిరించి సైబర్ నేరగాళ్లు రూ.15,625 కాజేశారు. వివరాలు.. ఆదోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి బాబు రాజేంద్రప్రసాద్ కుటుంబం నివాసం ఉంటోంది. మంగళవారం రాజేంద్రప్రసాద్ ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఫోన్‌కాల్ రాగా ఆయన కుమారుడు సాయికృష్ణ లిఫ్ట్ చేశారు. అవతలివైపు వారు మాట్లాడుతూ.. రాజేంద్రప్రసాద్‌పై మనీ లాండరింగ్ కేసు నమోదైందని, 2024 మార్చిలో అరెస్టు వారెంట్ జారీ అయ్యిందని చెప్పి బెదిరించారు. కేసు నకిలీ పత్రాలు, రాజేంద్రప్రసాద్ డెబిట్ కార్డు ఫొటోను వాట్సాప్‌లో పంపి భయభ్రాంతులకు గురి చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేస్తామని, అలా గాకుండా ఉండాలంటే రూ.15625 ఫీజు మొత్తాన్ని ఫోన్‌పే చేయాలని హెచ్చరించారు. సాయిక్రిష్ణ భయాందోళనతో వణికిపోతూ ఫోన్ మాట్లాడుతుండగా ఇంట్లోకి వచ్చిన తండ్రి జరిగిన విషయం తెలుసుకున్నారు. కుమారుడి భయాన్ని చూసి ఒత్తిడితో దుండగులు చెప్పిన నంబర్‌కు రూ.15,625 ఫోన్‌పే చేశారు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. మోసపోయినట్లు గ్రహించిన రాజేంద్రప్రసాద్ త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- ఆమె భర్తకు తీవ్రగాయాలు
- బైక్‌పై వెళ్తుండగా మినీలారీ ఢీకొట్టడంతో ప్రమాదం



భారతి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు



భారతి (ఫైల్)

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై ఎస్ఐ నరేంద్ర కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పాణ్యంకు చెందిన శ్రీనివాసులు, భార్య భారతి (48) దంపతులు. శ్రీనివాసులుకు ఆరోగ్య సమస్యలు ఉండటంతో మంగళవారం డయాలసిస్ చేయించేందుకు ఏపీ 39 క్యూడీ 9469 నంబర్ గల స్కూటీలో కర్నూలు బయలుదేరారు. తమ్మరాజుపల్లె ఘాట్ వద్ద పెద్దమ్మ గుడి సమీపంలో కర్నూలు వైపు వెళ్తున్న ఆర్‌జే 17 జీఏ 9255 నంబరు గల మినీలారీ స్కూటర్‌ను ఢీకొట్టింది. దంపతులు కిందపడగా భారతి పైనుంచి మినీలారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీనివాసులుకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో నంద్యాలకు తరలించారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో నివాసముంటున్న వీరు ఇటీవలే పాణ్యం వచ్చి స్థిరపడ్డారు. వారికి ముగ్గురు కుమార్తెలు సంతానం ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది హైవేపై ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లకు చెందిన పసుపుల వెంకటేశ్వర్లు (55) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మినారాయణ తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశ్వర్లు లోడింగ్ కార్మికుడిగా పని చేస్తుండేవాడు. తరచూ మద్యం సేవిస్తూ అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది పేడ రంగు నీటిలో కలుపుకుని తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రూ.37.9 లక్షలు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐలు ఇంతియాజ్‌బాషా, సీఎం రాకేష్

డోన్ టౌన్: ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.37.9 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పట్టణ సీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్‌బాషా, సీఎం రాకేష్ వివరాలు వెల్లడించారు. మంగళవారం తెల్లవారు జామున పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నూలు వైపు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న ఇంటర్ సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నంద్యాల పట్టణానికి చెందిన షేక్ అన్వర్ అనే వ్యక్తి వద్ద రూ. 37.9 లక్షల నగదు లభించింది. పోలీసులు ఆరా తీయగా వ్యాపారం నిమిత్తం నగదుతో బెంగళూరు వెళుతున్నట్లు తెలిపినా, నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపలేదు. దీంతో నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐలు తెలిపారు. వ్యాపారి నగదుకు సరైన రుజువులు చూపిస్తే తిరిగి ఇచ్చేస్తామని, లేదంటే ఇన్‌కం ట్యాక్స్ డిపార్టుమెంటుకు అప్పగిస్తామన్నారు. తనిఖీల్లో పట్టణ, రూరల్ ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, మమత, సిబ్బంది పాల్గొన్నారు.



నాడు గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారిన రోడ్డు



నేడు రాక పోకలకు అనువుగా బి.నాగిరెడ్డిపల్లె - పేరూరు రోడ్డు

రైతులు రోడ్డేశారు!

'సార్.. రోడ్డుకు మరమ్మతులు చేయండి' అంటూ అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఇంకెన్నాళ్లు ఈ దారిద్ర్యం అంటూ మదనపడ్డారు. చివరకు చందాలు వేసుకుని మరమ్మతులు చేసుకున్నారు. పేరూరు పంచాయతీకి మజరా గ్రామమైన బి.నాగిరెడ్డిపల్లెకు వెళ్లాలంటే గుంతల దారిలో వెళ్లాల్సిందే. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలిచి వాహనాలు ముందుకు వెళ్లని పరిస్థితి దాపురిస్తుంది. సమస్యను అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో గ్రామంలోని రైతులందరూ ఒక్కటయ్యారు. తోచినంతగా చందాలు వేసుకున్నారు. పోగైన సొమ్ముతో మట్టి తోలించి రోడ్డుపై గుంతలను పూడ్చి చదును చేశారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించారు. - రుద్రవరం